క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ధన్వాడ: ధన్వాడ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 24 సీట్లకు సోమవారం స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ గంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి అయిన బాలికలు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు తమ ఒరిజనల్ ధృవపత్రాలు, ఆధార్ కార్డు తీసుకొని కళాశాలకు వస్తే ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు.

రేపు ఉపాధిహామీ ప్రజావేదిక

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలో 2024–25 ఏడాదికి సంబంధించిన జరిగిన ఉపాధిహామీ పనులపై ఈనెల 22న మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నర్సింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి మద్దూరు మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా మొత్తం రూ. 6 కోట్ల పనులు జరగగా ఈ పనులపై తనిఖీ చేపట్టనున్నట్లు తెలిపారు.

విత్తనాలను సద్వినియోగించుకోవాలి



మరికల్: పశుగ్రాస విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశుసంవర్ధక అధికారులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రానికి 15 క్వింటాళ్ల పశుగ్రాస విత్తనాలు వచ్చి కూడా 20 రోజులైనా రైతులెవరూ విత్తనాలను తీసుకొనేందుకు ముందుకు రాకపోవడంపై అధికారులు స్పందించారు. 5 కిలోల విత్తనాల ప్యాకెట్ సబ్సిడీ పోనూ రూ. 50కు అందజేస్తున్నట్లు తెలిపారు. అన్నదాతలు పంటల సాగు చేపట్టిన నేపథ్యంలో గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా కృష్ణారెడ్డి



నర్వ: ఆత్మకూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నర్వకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు డి. కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఈయనను ప్రభుత్వం శనివారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి డా.వాకిటి శ్రీహరి తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన ఈ పదవికి సంపూర్ణ న్యాయం చేకూర్చుతానన్నారు. మండలంలోని రైతాంగానికి ఎల్లప్పుడు అండగా నిలబడి అన్నదాతల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన మంత్రికి, పార్టీ నాయకులకు, తనకు అండగా నిలిచిన మండల నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

వాహనాల తనిఖీ



నారాయణపేట రూరల్/ నారాయణపేట క్రైం: జిల్లా కేంద్రం సమీపంలోని ఎర్రగుట్ట చౌరస్తాలో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఏఎస్‌ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలు, కార్లను ఆపి లైసెన్స్, అన్ని రకాల పర్మిట్ పత్రాలు పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపట్టారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. వేగ నియంత్రణ పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాలని వాహనదారులకు సూచించారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ



నర్వ: బాల్కొండలో బీఆర్ఎస్ నాయకుల దాడిలో గాయపడిన ఎస్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ మెంబర్ నంగీ దేవేందర్‌రెడ్డిని ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. భౌతిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నంగీని పరామర్శించిన వారిలో చంద్రశేఖర్‌రెడ్డి, నాగన్న గారి శ్రీనివాస్‌రెడ్డి, వివేక వర్ధన్‌రెడ్డి, నంగి మహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

బోనస్.. అందేనా?



తీలేర్ కేంద్రంలో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యం (ఫైల్)

- రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ
- వానాకాలం పెట్టుబడులకైనా బోనస్ చెల్లించాలి
- ఎదురుచూస్తున్న అన్నదాతలు

మరికల్: యాసంగి సీజన్ ధాన్యానికి సంబంధించిన బోనస్ డబ్బుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అధిక శాతం రైతులు సన్నరకం ధాన్యం రకాలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. ప్రస్తుతం వానాకాలం ప్రారంభం కావడంతో వరి సాగుకు నాట్లు వేసుకుంటున్నారు. అయినా బోనస్ చెల్లింపులపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. జిల్లా వ్యాప్తంగా 102 కొనుగోలు కేంద్రాల ద్వారా 27,092 మంది రైతుల నుంచి రికార్డు స్థాయిలో 1.90,628.200 మెట్రిక్ టన్నుల పై చిలుకు ధాన్యం సేకరణ జరిగింది. వీరందరికి ధాన్యానికి సంబంధించిన డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. కానీ బోనస్ జమ చేయలేదు. ఈ ఏడాది మే నెలలో విస్తరంగా వర్షాలు కురువడంతో రైతులు ముందస్తుగా వర్షాకాలం సాగుకు సంబంధించిన విత్తనాలు సమకూర్చుకున్నారు. ఇందుకు గాను వ్యవసాయ పెట్టుబడుల అవసరం ఏర్పడింది. బోనస్ డబ్బులు తర్వగా వస్తాయని ఆశించినా ఇంకా విడుదల కాకపోవడంతో రైతులు నిరీక్షిస్తున్నారు. తర్వగా వస్తే పెట్టుబడులకు సద్వినియోగం చేసుకోవచ్చని ఆలోచిస్తున్నారు.

గతంలో ఇతరులకు విక్రయాలు..

సన్నరకం ధాన్యాన్ని గతంలో ఇతర వ్యాపారులకు విక్రయించేవారు. రాయచూర్ నుంచి వచ్చే కమిషన్ వ్యాపారులు నేరుగా రైతుల పొలాల దగ్గరకు వెళ్లి కోత వేసిన ధాన్యానికి ధర కట్టి కొనుగోలు చేసేవారు. అయితే ప్రభుత్వం యాసంగి ధాన్యంకు బోనస్ ప్రకటించడంతో రైతులు కమిషన్ వ్యాపారులకు కాకుండా ప్రభుత్వానికే విక్రయించారు. కానీ అనుకున్న సమయానికి బోనస్ డబ్బులు జమకాక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. పెట్టుబడుల కోసమైనా త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వెంటనే జమ చేయాలి



యాసంగి సీజన్‌లో బోనస్ ఇస్తామంటే ప్రభుత్వ మాటలు నమ్మి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాం. ధాన్యం విక్రయించి రెండు నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు బోనస్ డబ్బులు వేయలేదు. ప్రస్తుతం వానాకాలం పంటల సాగు చేస్తున్నాం. పెట్టుబడుల కోసమైన బోనస్ విడుదల చేయాలి. నాకు యాసంగి ధాన్యంకు సంబంధించి రూ.25 వేల బోనస్ రావాల్సింది.

– శ్రీనివాస్‌గౌడ్, రైతు, మరికల్

రూ.80 వేలు రావాలి



రెండు నెలల క్రితం ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో సన్నరకం ధాన్యం విక్రయించాను. ధాన్యం డబ్బులు ఖాతాలో జమ చేశారు. కానీ నాకు రావాల్సిన రూ.80వేలు బోనస్ డబ్బులు జమ చేయలేదు. ప్రస్తుతం పెట్టుబడుల కాలం ప్రభుత్వం స్పందించి వెంటనే బోనస్ విడుదల చేస్తే పెట్టుబడికి ఉపయోగకరంగా ఉంటాయి.

– వెంకట్‌రెడ్డి, కన్మనూర్

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

యాసంగి సన్నరకం ధాన్యంకు సంబంధించిన బోనస్ డబ్బులు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉంది. ఈ విషయంపై రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం బోనస్ నిధులు మంజూరు చేస్తే రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

– సైదులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, నారాయణపేట

రైతుల ఇబ్బందులు కనిపించడం లేదా?



మాగనూర్ సమీపంలో నీళ్లు లేక ఎండిపోయిన కుడి లోలెవల్ కెనాల్

మాగనూర్: మండలంలోని మాగనూర్, పెగడబండ, అచ్చంపేట గ్రామాల రైతులు పంటల సాగు చేపట్టినా ప్రభుత్వం ఇంత వరకు సంగంబండ చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కుడి లోలెవల్ కెనాల్‌కు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేయడం లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఒక వైపు రైతులు నీళ్ల రావడం లేదు మహాప్రభో అని నెత్తి నోరు మొత్తుకుంటున్నా, కాంగ్రెస్ నాయకులు మాత్రం విలేకర్ల సమావేశం పెట్టి 80శాతం చెరువులు నింపినాం అని డబ్బు కొట్టుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కుడి ఎడమ కాలువలకు నీళ్లు పుష్కలంగా వస్తున్నాయని అంటున్న కాంగ్రెస్ నాయకులకు మరి ఈ ప్రాంతాల రైతులు పడుతున్న ఇబ్బందులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాలువలో నీరు వస్తుందో లేదో తెలుసుకోవాలంటే పొలాలు, కాలువల వెంబడి తిరిగి చూడండి.. రైతులను కలవండి వారే చూపిస్తారు.. నీళ్లు ఎక్కడ రావడం లేదో అని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కళ్లు తెరిచి రైతులను ఆదుకోవాలని కోరారు.

మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

దామరగిద్ద: పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కాన్‌కుర్తి శివారులో నిర్మిస్తున్న రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం మార్కెట్ విలువల ప్రకారం పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, మాజీ వైస్ ఎంపీపీ మహేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కాన్‌కుర్తి రైతు వేదికలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.14 లక్షలు ఇస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు. ఎకరాలకు మార్కెట్ విలువ ప్రకారం రూ.30 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మొత్తం భూమిని కోల్పోతున్న రైతులకు మరో చోట భూమిని కేటాయించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మొగులప్ప, మాజీ ఎంపీటీసీ బస్వరాజ్, రామకృష్ణ, జ్ఞానేశ్వర్, జోషి, శ్రీహరిగౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శివ కుమార్, గౌస్, ఆశప్ప పంకజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలతో అభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గణేశ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టడంతో ఆదివారం మక్తల్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి చిత్రపటాలకు పాలతో అభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఒక్క రేషన్‌కార్డు, ఒక్క ఇల్లు మంజూరు చేయలేదని విమర్శించారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మక్తల్ నియోజకవర్గంలోని పేదలకు 7వేల రేషన్ కార్డులు అలాగే 3500 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో కట్ట సురేశ్, ఫయాజ్, శ్రీనివాసులు, రవికుమార్, కట్ట వెంకటేశ్, టీవీ వెంకట్, బాల్‌రాజ్, భాస్కర్, నర్సింహ, రాజేందర్, కోళ్ల వెంకటేస్, లక్ష్మన్, శంశోద్దీన్, వాకిటగి వ్యామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా ఉండాలి

మరికల్: నాయీ బ్రాహ్మణుల కుల వృత్తిని దెబ్బ తీసే ఆర్టికల్–19 ఎత్తి వేయాలని ఆదివారం సెలూన్ షాపులు మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ తమ జీవితాలను నాశనం చేసేందుకు తీసుకొచ్చిన ఆర్టికల్–19 అమలు వెనుకాల కుట్ర ఉందన్నారు. తమ కులవృత్తిని ఇతర మతస్తులు చేయడానికి వీలు లేదన్నారు. ఇతర మతస్తులు సెలూన్ షాపులు పెట్టుకుంటే తమ కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందన్నారు. కులవృత్తినే నమ్ముకొని జీవిస్తున్న నాయీ బ్రాహ్మణుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమడితే గుణపాఠం చెప్పి తీరుతామన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రఘు, అశోక్, వేణు, బీషులు, శివ, నర్సింములు, వెంకట్ రాములు, బాల్‌రాజ్, ఈశ్వర్,నరేష్ పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయడం శుభపరిణామం

మాగనూర్: రాష్ట్రంలోని మూడు జిల్లాలకు కేంద్రం నిధులు మంజూరు చేయడం పట్ల మాగనూర్, కృష్ణ మండలాల బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. అన్నదాతలను ఆదుకోవాలనే ఉద్దేశంతో 2021–22వ సంవత్సరంలో నిర్వహించిన దేశవ్యాప్త సర్వే ఆధారంగా రాష్ట్రంలో మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణ పేట జిల్లాలను కరువు జిల్లాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు ఈ జిల్లాల అభివృద్ధికి అలాగే కరువు నివారణ నిమిత్తం 15వ ఆర్థిక సంఘం సూచన మేరకు రూ.100 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులను అధికారులు సద్వినియోగం చేసుకొని జిల్లాల్లో కరువు నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్లను బాగు చేయండి




మరికల్: మండల కేంద్రంలోని రోడ్లు చిన్న పాటి వర్షాలకే చిత్తడిగా మారుతున్నాయి. ముఖ్యంగా గజ్జలమ్మగడ్డ కాలనీకి వెళ్లే రహదారిపై వర్షపునీరు నిలవడంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గజ్జలమ్మగడ్డ కాలనీకి వెళ్లే రహదారికి మరమ్మతు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి

అమరచింత (ఆత్మకూర్): సీపీఐ జిల్లా మూడో మహాసభలు ఈ నెల 23, 24 తేదీల్లో ఆత్మకూర్‌లోని ఎంజీ గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని కార్మికులు, కర్షకులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆత్మకూర్‌లో, అమరచింతలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మహాసభకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బాలనర్సింహాతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారన్నారు. కార్మికులు పెద్దసంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, సీఎన్‌శెట్టి, లక్ష్మీనారాయణశెట్టి, కుతూబ్, లింగన్న, రవీందర్, అబ్రహం, శ్యాంసుందర్, ఇబ్రాయిల్, సౌలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

మండలం కేంద్రంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ఎలాంటి రక్షణ వలయాలు ఏర్పాటు చేయకపోవడంతో పాటు తక్కువ ఎత్తులో కట్టలు నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా అంబేడ్కర్ చౌరస్తాలోని కూడలిలో అలాగే స్థానిక శ్రీలక్ష్మినర్సింహాస్వామి దేవాలయం, ఆస్పత్రి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రహరీ ఏర్పాటు చేయడంతో పాటు కట్టల ఎత్తు పెంచి ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని పేర్కొంటున్నారు. – మాగనూర్





రక్తదానానికి యువకులు ముందుకు రావాలి

ఊట్కూరు: రక్తదానానికి యువకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రీతిరెడ్డి అన్నారు. ఆదివారం ఊట్కూరులో శక్తి ఫౌండేషన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శస్త్ర చికిత్స సమయంలో సరైన గ్రూపు రక్తం దొరకక చాలా మంది మృతి చెందుతున్నారన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న రోగులను కాపాడిన వారమతుతామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎల్కోటి నారాయణరెడ్డి, శక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పేట వాసులకు జాతీయ అవార్డు



నారాయణపేట రూరల్: మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లా వాసులు నలుగురు జాతీయస్థాయి అవార్డులను పొందారు. విజయవాడలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్, యోగాలో విస్తృత సేవలను అందిస్తున్న వీరిని గుర్తించి అవార్డులను అందజేశారు. ఈ క్రమంలో జిల్లాకు చెందిన మాస్టర్లు నానక్ రామ్, కోన సాయి కృష్ణ, స్వాతి, శ్రీ చరణ్ అవార్డుకు ఎంపికై ప్రముఖ సినీనటుడు భాను చందర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ మేరకు పలువురు కరాటే శిక్షకులు వీరికి అభినందనలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు: పెదిరిపాడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఒక హెడ్‌కుక్, ఒక అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ బాలకిష్టప్ప ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుభ కార్యాలకు వంట చేసిన అనుభవంతో పాటు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, స్థానికంగా ఉండే మహిళలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 22 నుంచి 24వ తేదీ లోపు కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి గ్రామ శివారులో ఆదివారం విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన గౌరిశంకర్ అనే రైతు ఆవును మేత కోసం పొలం దగ్గరకు తీసుకెళ్లాడు. మేత మేసే క్రమంలో ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫారం దగ్గర వెళ్లింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైతు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే గోవు మృతిచెంది పడి ఉంది. మరణించిన ఆవు విలువ రూ.60 వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

నారాయణపేట రూరల్: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి జిల్లా అధ్యక్షులు మచేందర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలరాం డిమాండ్ చేశారు. భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని వారు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 6వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కోల్పోతున్న రైతులకు ఎకరాకు ప్రభుత్వం రూ.14 లక్షలు ఇస్తాననడం సరికాదన్నారు. ఈ ప్రాంతంలో ఎకరా రూ.30 లక్షల పైబడి ధర ఉందన్నారు. భూమికి బదులు భూమి కేటాయించాలని, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బలవంతంగా భూములు తీసుకోవడం ఆపాలని, రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చి వారిని సంతృప్తి పరిచిన తరువాత భూములు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ధర్మరాజు, మహేష్, కేశవులు, ఆంజనేయులు, హన్మంతు, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



ఎక్కామేడ్-మన్నాపూర్ మధ్య నిలిచిన పనులు

కొత్తపల్లి: ఉమ్మడి మద్దూరు మండలంలోని మద్దూరు నుంచి లింగాల్ చేడ్ వరకు చేపట్టిన రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మద్దూరు నుంచి లింగాల చేడ్ వరకు దాదాపు 15 కిలోమీటర్ల రోడ్డు గుంతల మయంగా మారడంతో ప్రభుత్వం రూ.39 కోట్లతో రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ దాదాపు 12 కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి ఎక్కామేడ్–మన్నాపూర్ మధ్యలో అనివార్య కారణాలతో పనులు నిలిపేశాడు. ఈ రోడ్డుపై వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మిగిలిన పనులను పూర్తి చేయించి త్వరగా వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అప్రమత్తతతోనే ప్రాణరక్షణ!



కేజీవీల్స్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు (ఫైల్)

- వ్యవసాయ పనులు ముమ్మరం
- ట్రాక్టర్ల వినియోగం, విద్యుత్ మరమ్మతుల్లో జాగ్రత్త
- ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు

మాగనూర్: వానాకాలం మొదలైంది. రైతులు పొలం పనులకు శ్రీకారం చుట్టారు. మాగనూర్ మండలం మొత్తం వ్యవసాయాధారితం కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు, దినసరి రైతు కూలీలు పొలం బాట పడుతున్నారు. వానాకాలం కావడంతో పొలాల్లో పాములు, విషపు పురుగులు సంచారం ఎక్కువగా ఉంటుంది. మరోవైపు విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. వ్యవసాయ పనులకు ఉపయోగించే వాహనాలను నడిపే సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలి. ఏమరపాటుతో విద్యుత్, ట్రాక్టర్ ప్రమాదాలు జరగడం అలాగే పాముకాటుతో రైతులు, కూలీలు చనిపోతున్నారు. ఇలాంటి ఘటనలు బాధిత కుటుంబాలకు తీరని దు:ఖం మిగుల్చుతాయి.

పెరిగిన ట్రాక్టర్ల వినియోగం..

మండల పరిధిలో వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో రైతులు దుక్కులు దున్నడం, కల్టివేటర్ కొట్టడం, విత్తనాల సాళ్లు పెట్టడం తదితర పనులన్నీ ట్రాక్టర్లతోనే చేయిస్తున్నారు. గతంలో రైతులు ఎద్దులు, నాగలి ఉపయోగించేవారు. ఇప్పుడు అందరూ ట్రాక్టర్లే వాడుతున్నారు. ఈ క్రమంలో యంత్రాల వినియోగంలో అనుభవరాహిత్యమో.. అజాగ్రత్తతోనో ప్రమాదాల బారిన పడుతున్నారు.

పాముకాటుతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు..

వర్షాకాలంలో ఎక్కువ మంది రైతులు పాము కాటుకు గురవుతుంటారు. పాముకాటుకు మందులు ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. చిన్నారులు చెట్లు, పుట్టల వెంట తిరుగుతుంటారు. విషసర్పాలు , విషపు పురుగులు చల్లదనం కోసం పొలాల గట్టు, ఇళ్ల ఆవరణలో సంచరిస్తుంటాయి. రాత్రి సమయాల్లో జాగ్రత్తగా వెళ్లకపోతే పాముకాటుకు గురయ్యే అవకాశం ఉంటుంది. అయితే కింది సూచనలు పాటిస్తే ప్రమాదం నుంచి బయటపడొచ్చని అధికారులు సూచిస్తున్నారు.

- కేజీవీల్స్ వెనుకాల నాగళ్లు అమర్చుకోవడం వల్ల పల్టీ కొట్టదు.
- ముందు టైర్లు నీటిలో పూర్తిగా మునగకుండా చూసుకోవాలి.
- పొలానికి టార్చిలైట్ అలాగే బూట్లు ధరించడం వెళ్ల పాముకాటు, విషపురుగుల కాటు నుంచి బయటపడొచ్చు.
- చేతిలో కర్ర పట్టుకొని శబ్దం చేసుకుంటూ వెళ్తే పాములు దూరంగా వెళతాయి.
- ఒకవేళ కాటు వేస్తే కాటు వేసిన చోటు నుంచి పది ఇంచులా దూరంలో పైన తాడుతో గాని, చేతి రుమాలుతో గానీ గట్టిగా కట్టి ఆస్పత్రికి తీసుకెళ్తే ప్రాణపాయం నుంచి బయటపడొచ్చు.

జాగ్రత్తలు తప్పనిసరి..

రైతులు వర్షాకాలంలో ప్రమాదాలకు ఎక్కువగా గురవుతుంటారు. విద్యుత్ షాక్ అలాగే ట్రాక్టర్ ప్రమాదానికి గురికావడమో చూస్తుంటాం. అప్రమత్తతతోనే ఈ ప్రమాదాల నుంచి బయటపడగలం. పొలాలకు వెళ్లే సమయంలో రైతులు చేతిలో కర్రతో చప్పుడు చేసుకుంటూ వెళ్లడం వల్ల పాముకాటుకు గురికాకుండా ఉండొచ్చు. అనుభవం కలిగిన డ్రైవర్లతోనే పొలం పనులు చేయించుకోవడం ఉత్తమం

– సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏఈ, మాగనూర్